క్లుప్తంగా

డీజిల్ సరఫరాకు దరఖాస్తులు సమర్పణ



టెండర్ బాక్సులో దరఖాస్తు వేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్ విహార్): రోడ్డు రవాణా సంస్థ డిపోలకు డీజిల్ సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లకు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో మొత్తం ఐదు డిపోలకు 8 మంది నుంచి 12 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు వేసేందుకు అధికారులు సమయం ఇచ్చారు. ఆ తర్వాత టెండరు బాక్సు తెరిచి పరిశీలించగా అందులో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఎండీ కార్యాలయానికి పంపించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సూచనల మేరకు మిగతా ప్రక్రియ నిర్వహిస్తామని రీజినల్ మేనేజరు వెంకటరామం పేర్కొన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకోండి



వీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు : మండలంలో అక్రమ ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకట్ట వేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ కోరారు. ఈమేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓ గురురాజారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నకడబూరు, కల్లుకుంట గ్రామాల్లో పొలాలకు వెళ్లే రహదారుల వెంబడి ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దీంతో రహదారులన్నీ గుంతలమయంగా మారి రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు.నాయకులు తిక్కన్న, సర్దార్‌పటేల్, హనుమంతు, హయత్‌పటేల్, గిడ్డయ్య, నాగరాజు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారికి పనులు కల్పించాలి



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆదోని రూరల్ : జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కార్మికుడికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.600 వేతనమిచ్చి, వలసలు నివారించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో ఉపాధి లేక ప్రజలు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరికీ పని కల్పించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. నాయకులు మద్దిలేటి, బసాపురం గోపాల్, నరసింహులు, నాగన్న, నాగరాజు, రమేష్, గోపాల్, సిద్ధయ్య, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై సెబ్ అధికారుల దాడి



నాటుసారా స్థావరాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఆదోని రూరల్ : పట్టణ సమీపంలోని గద్దరాళ్ల కొండపై ఉన్న నాటుసారా స్థావరంపై సెబ్ సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన శివారెడ్డి, శ్రీనివాస్‌ను గుర్తించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి లబ్ధిదారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేయిజీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి కుళాయిలు వంటి వసతులను కల్పిస్తుందని వివరించారు.

ప్లాస్టిక్‌కు నో..

ప్లాస్టిక్ జీవితంలో ఓ భాగమై పోయింది. ఎంతలా అంటే మనం వినియోగించే వస్తువుల్లో 95 శాతానికి పైగా అవే ఉండేంతగా. దుష్పరిణామాల గురించి తెలిసి కూడా వినియోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నివారణకు ప్రభుత్వం ఎన్ని రకాల చర్యలు చేపట్టినా ఫలితం ఇవ్వడం లేదు. ఇందుకు కారణం.. ప్రజల సహకారం లేకపోవడమే. ఎలాగైనా దాన్ని కొంతవరకైనా నిషేధించాలని చర్యలకు నడుం బిగించింది. ఇందుకు చర్యలు కఠినతరం చేయడంతో ఇప్పుడిప్పుడే జనంలో కొంతమేర మార్పు కనిపిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని దాదాపుగా తగ్గించాలని ప్రభుత్వం కోరుతోంది.

- కవర్లకు బదులుగా బట్ట, జ్యూట్ బ్యాగులు వాడాలి
- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఆదోనిటౌన్ : స్త్రీలు ధరించి బొట్టు బిళ్లకు వెనక ఉపయోగించే ప్లాస్టిక్ నుంచి లక్షలాది రూపాయల వస్తువులో కూడా ప్లాస్టిక్ భాగస్వామ్యమైంది. పది రూపాయల కూరగాయలను కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులో తీసుకెళ్తున్నాం. ఇలా మనమే పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాం.ఇప్పటికే రుతుపవనాలు గతి తప్పాయి. వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భూతాపం పెరిగిపోతుండటంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. విషతుల్యమవుతున్న వాతావరణాన్ని రక్షించేందుకు ప్లాస్టిక్ నిషేధమొక్కటే పరిష్కారమని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నా వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం క్యారీబ్యాగ్ లేనిదే కూరగాయలు, నిత్యావసర వస్తువులు, హోటళ్లలో పార్శిల్, చివరకు పురుగు మందులను కూడా వాటిల్లోనూ తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకున్న కంపెనీలు ఆకట్టుకునే విధంగా తయారు చేస్తున్నాయి. ప్రజల జీవనానికి హానికరంగా మారిన నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, మానవాళి మనుగడను కాపాడాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2016లో ప్లాస్టిక్‌ను నిషేధించాయి. 50–70 మైక్రాన్ల సామర్థ్యం కలిగిన కవర్లను వినియోగించాలని ఆదేశించాయి. అయితే 1-07-2022న ఆ చట్టాన్ని సవరించాయి. ప్రస్తుతం 120 మైక్రాన్‌ల క్యారీ బ్యాగులు, కవర్‌లను వాడాలని ఆదేశించాయి. ఆదోని డివిజన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు ఉక్కుపాదం మోపాయి. వాటిని విక్రయించే దుకాణాల్లో వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆదోని మున్సిపాలిటీలో 2018–19 నుంచి వరుస దాడులు చేస్తున్నారు. వ్యాపార దుకాణాలు, గోదాములపై దాడులు చేసి పెద్ద మొత్తంలో కవర్‌లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేస్తున్నారు. పట్టణంలో ఇప్పటివరకు 14 వ్యాపార దుకాణాలకు రూ.3 లక్షలు వరకు జరిమానా విధించారు. రూ.20 లక్షలకు పైగానే ప్లాస్టిక్ కవర్‌లు, గ్లాసులను స్వాధీనం చేసుకుని తగులబెట్టారు.



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్‌లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

హైదరాబాద్ టూ ఆదోని..

ప్లాస్టిక్ కవర్‌ల తయారీ హైదరాబాద్ కేంద్రంగా నడుస్తోంది. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, కోసిగి తదితర నియోజకవర్గాలతో పాటు మండలాలకు హైదరాబాద్ నుంచే దిగుమతి అవుతున్నాయి. పట్టణంలో సుమారు ఏడెనిమిది మంది వ్యాపారులు హైదరాబాద్ నుంచి గుట్టుగా దిగుమతి చేసుకుంటూ దుకాణాలకు చేరవేస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా మూడు గోదాములు, చిన్నచిన్న గోదాములు మరో నాలుగింటిలో దిగుమతి చేసుకున్న ప్లాస్టిక్ కవర్‌లను నిల్వ ఉంచుకుంటూ రాత్రికి రాత్రే పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. పోలీసులు, మున్సిపల్, పంచాయతీ అధికారుల కళ్లుగప్పి దందా కొనసాగిస్తున్నారు. ఇందులో కొందరు అధికారుల పాత్రపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బట్ట,జ్యూట్ సంచులు మేలు..

బట్ట,జ్యూట్‌తో తయారు చేసిన సంచులను వాడితే పర్యావరణానికి మేలు కలుగుతుంది. ముఖ్యంగా ఎంత బరువున్నా వాటిలో సులభంగా తీసుకెళ్లే అవకాశముంటుంది. అలాగే పునర్వినియోగం కూడా సులవే. పట్టణంలో ఇప్పటికే పలువురు దుకాణాదారులు వీటిని వినియోగంలోకి తీసుకొచ్చారు. అన్ని దుకాణాల్లో ఇలాంటివి వినియోగంలోకి వచ్చేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

ప్లాస్టిక్ కవర్ల నిషేధం మంచిదే



ప్లాస్టిక్ కవర్ల నిషేధం మంచిదే. వాటి స్థానంలో బట్ట, జ్యూట్‌తో తయారు చేసిన క్యారీ బ్యాగ్‌లను ప్రజలకు అనువైన ధరలతో విక్రయించాలి. దీంతో పర్యావరణాన్ని కాపాడిన వారమవుతాం. ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను కిందిస్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా అమలు చేస్తే నిషేధం సులువే.

– లక్ష్మన్న, ఆదోని

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం



ప్లాస్టిక్ కవర్‌లను అమ్మినా, కొన్నా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాయి. అయితే కొందరు వ్యాపారులు గుట్టుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. అలాంటి వారిపై దృష్టి సారించాం. దిగుమతి చేసుకున్న నిల్వలలు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో గుర్తించి దాడులు చేసి స్వాధీనం చేసుకొని ధ్వంసం చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ.20 లక్షలకు పైగానే కవర్‌లను పట్టుకున్నాం. సచివాలయాల వారీగా వార్డుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. పర్యావరణం పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ఆదోని అర్బన్ : పట్టణంలోని మిల్టన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. వివిధ రకాల ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమానికి డాక్టర్ అభినాష్‌చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని తిలకించారు. పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ మోహన్, సీఈఓ వెంకటేష్, ఉపాధ్యాయులు నాగరాజు, సుశీల పాల్గొన్నారు.

వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు

ఆదోనిటౌన్ : పట్టణంలోని అన్ని వార్డులో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్‌లు వేయనున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 8వ వార్డు, అరుంజ్యోతినగర్, నోబుల్ కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. కొత్తగా వేపడుతున్న సీసీ రోడ్లు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించారు.

మినీ వాటర్ ట్యాంకు ప్రారంభం

ఆదోనిటౌన్ : పట్టణంలోని క్రాంతినగర్, రేణుకాంబ హోటల్ వెనకభాగంలో సయ్యద్‌షా దర్గా వద్ద సోమవారం మినీ వాటర్ ట్యాంక్‌ను జైభీమ్ యూత్ అధ్యక్ష కార్యదర్శులు విజయన్, చిన్నా, ఉశేని సోమవారం ప్రారంభించారు. స్థానికుల సమస్య పరిష్కారంలో భాగంగా వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసినట్లు విజయన్ తెలిపారు. న్యూగాంధీ నగర్‌లో మరో వాటర్ ట్యాంకును త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. నరసప్ప, ప్రేమ్, శివ, రవి, ఝాన్సీ పాల్గొన్నారు.

మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు

తుగ్గలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ రవి సోమవారం తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు 1,344 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 25 మంది ఉన్నారన్నారు. తుగ్గలిలోనే రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

హొళగుంద: గృహ, వ్యవసాయ ఇతర విద్యుత్ వినియోగదారులు పాత బకాయిలులను వెంటనే చెల్లించాలని ఆలూరు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన విద్యుత్ బకాయిలపై వినియోగదారులను కలిసి బిల్లులు చెల్లించాలని కోరారు. మండలంలో భారీగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే విద్యుత్ పొదుపుగా వాడాలని, అక్రమ కనెక్షన్లతో చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈ ఓబులమ్మ, సిబ్బంది మౌనాప్పాచారి, షణ్ముఖ వెంట ఉన్నారు.

భూసర్వే పక్కాగా చేపట్టండి

ఆలూరు:మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర భూసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవనకొండ తహసీల్దార్ సుదర్శనం వీఆర్వోలు, సర్వేయర్లను ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక కార్యాలయంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో రైతుల భూములు, గ్రామ కంఠం, అసైన్డు, దేవాలయాలకు కేటాయించిన భూములను గుర్తించాలన్నారు. సర్వే పక్కాగా చేపట్టి హద్దులను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెల్దుర్తి:స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు కళాజాత ఆర్గనైజేషన్ బృందం వారిచే అర్థవంతమైన పాటల రూపంలో బ్యాంకు పరిధిలోని రుణాలు, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా పథకాలను వివరించారు. బ్యాంకు మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రుష్యేంద్ర పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

పత్తికొండ రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకుడు, అభ్యర్థి సోదరుడు చంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేశారు. స్థానిక కొండగేరి, జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

వాహనాలు అడ్డంగా నిలిపితే చర్యలు

మద్దికెర: స్థానిక పంచాయతీ కార్యాలయం ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని ఈఓ శ్రీహరి సోమవారం హెచ్చరించారు. ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను బస్టాండు వద్ద నిలిపేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటోలు ఇష్టానుసారంగా దుకాణాల ముందు నిలపరాదని సూచించారు. ఒక ఆటో వెళ్లిన తర్వాత మరో ఆటో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు.

అన్నదాన సేవలో ఎస్‌ఐ కుటుంబం

వెల్దుర్తి: కుమారుడి పుట్టిన రోజు పురస్కరించుకుని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి కుటుంబంతో కలిసి సోమవారం స్థానిక జర్నలిస్ట్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సేవలో పాల్గొన్నారు. సొంత ఖర్చులతో సోమవారం నాటి అన్నదానంలో పాలుపంచుకున్నారు. బర్త్‌డే చిన్నారితో కలిసి పేదలకు భోజనం వడ్డించారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

6 గడ్డివాములు దగ్ధం

ఆలూరు రూరల్/హాలహర్వి: గూళ్యం గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 6 గడ్డివాములు దగ్ధమయ్యాయి. సోమవారం సాయంత్రం 7 గంటలకు గ్రామంలోని మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు.. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన రైతులు వీరేష్, పంపాపతి, శివ, మల్లన్న గౌడ్‌లు పశువుల గ్రాసం కోసం ఇటీవలే వరిగడ్డి కొనుగోలు చేసి గ్రామంలో గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు.ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అగ్నిప్రమాదంలో ఆరు గడ్డివాములు దగ్ధం కాగా రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిదని బాధిత రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న హాలహర్వి తహసీల్దార్ మల్లికార్జున సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి రైతులకు న్యాయం చేస్తామన్నారు.

ఘనంగా వసంతోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో శ్రీ రంగనాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు, చిన్నారులు ఆనందోత్సాహాలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ

పత్తికొండ రూరల్: 'పర్యావరణం – సమస్యలు' అనే అంశంపై సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో పత్తికొండ ఏపీఆర్ స్కూల్ విద్యార్థి సిరాజుద్దీన్ ప్రతిభ చాటాడు. విద్యార్థి రూపొందించిన నమూనా ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

కన్నడ విద్యార్థులుగా గుర్తించాలి



బళ్లారిలో ర్యాలీగా వెళ్తున్న ఆంధ్ర కన్నడ సంఘం నాయకులు



బళ్లారి జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ మాలపాటికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్ : ఆంధ్రాకు చెందిన కన్నడ విద్యార్థులను గడినాడు కన్నడ విద్యార్థులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్‌లోని పలు కన్నడ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దహరివాణం, ఆదోని, కర్నూలు, హొళగుంద కన్నడ ఉపాధ్యాయ సంఘాలు, అనంతపురం కర్ణాటక కన్నడ రక్షణవేదిక, కన్నడ రైతుసంఘం, బళ్లారి న్యాయవాదుల సంఘాల నాయకులు కలిసి బళ్లారిలో సోమవారం ధర్నా చేపట్టారు. తమ విద్యార్థులకు చదువు,ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. బళ్లారి కమ్మ భవన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ మాలపాటికి వినతి పత్రం అందజేశారు. కన్నడ సంఘం పెద్దహరివాణం కార్యదర్శులు కె.జంబునాథ, గర్జప్ప, పరమేష్, ఈర్లింగప్ప, కల్లప్ప, పంపన్న, శివ, అయ్యన్న, గురుబసవరాజు, దొడ్డబసప్ప, కునిబాలరాజు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి మోటర్ వాహనాల చట్టం ఉల్లంఘనలపై తనిఖీలు నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లో ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 32 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.42,190 జరిమానా విధించారు. తనిఖీల్లో పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను సోమవారం సాయంత్రం కొత్తపేటలో ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అపసవ్య దిశ (రాంగ్ రూట్)లో వాహనాలపై వెళ్లడం వల్ల జరిగే అనర్థాల గురించి డీఎస్పీ నాగభూషణం వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇకపై అప్పగించేది లేదని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ

పత్తికొండ రూరల్: 'పర్యావరణం – సమస్యలు' అనే అంశంపై సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో పత్తికొండ ఏపీఆర్ స్కూల్ విద్యార్థి సిరాజుద్దీన్ ప్రతిభ చాటాడు. విద్యార్థి రూపొందించిన నమూనా ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన గంజిహళ్లి ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా పీఠాధిపతులు సయ్యద్ చిన్న ముద్గోల్, మన్సూర్, ఉసేన్, బడేసా, చాంద్‌బాషలు స్వామి వారి గంధంతో ఊరేగింపుగా దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి భక్తితో గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.



స్వామివారికి జియరత్ గంధం సమర్పిస్తున్న పీఠాధిపతులు

బుడుగు బలానికి రాగి జావ

- ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకు సీఎం ఆదేశాలు
- జగనన్న గోరుముద్దలో మార్పులు
- మార్చి 2 నుంచి అమలు





హోసూరులో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలనే దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక మెనూ అమలుచేస్తున్నారు. ప్రస్తుత మెనూతో పాటు మార్చి 2వ తేదీ నుంచి విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారానికి 3 రోజులు (మంగళ, గురు, శనివారం) రాగిజావ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వమే ప్రతి పాఠశాలకు రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తుంది.

ప్రస్తుతం జగనన్న గోరుముద్ద మెనూ

- సోమవారం: వెజ్ పలావు, గుడ్డుకూర, చిక్కీ
- మంగళవారం: పులిహోర, దొండకాయ చట్నీ, గుడ్డు
- బుధవారం: వెజ్ బిర్యానీ, బంగాళాదుంప కూర, గుడ్డు, చిక్కీ
- గురువారం: లెమన్ రైస్, టమాట చట్నీ, గుడ్డు
- శుక్రవారం: అన్నం, పప్పు ఆకుకూర, గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకుకూరతో తయారుచేసిన అన్నం, స్వీట్ పొంగల్
- మెనూతో పాటు మార్చి 2వ తేదీ నుంచి వారంలో మూడు రోజులు రాగి జావ అందించనున్నారు.

పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 243 ప్రభుత్వ పాఠశాలల్లో 35,662 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో ప్రతిరోజు 34 వేల మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు.

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
పత్తికొండ	44	7,220
తుగ్గలి	66	7,942
వెల్దుర్తి	61	9,218
క్రిష్ణగిరి	46	7,532
మద్దికెర	26	3,750
మొత్తం	243	35,662

రాగిజావ అందించేందుకు చర్యలు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా రాగిజావ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. మార్చి 2వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టాం. రాగి పిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వారానికి 3 రోజులు రాగిజావ తయారుచేసి విద్యార్థులకు అందించాలి.

– రంగస్వామి, ఎంఈఓ, మద్దికెర

పోషకాలు అధికం



రాగి పిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. వేరుశనగ, నువ్వులు,ఆకుకూరలు, గుడ్డుతో పాటు రాగి పిండిలో కాల్షియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి విద్యార్థులకు శక్తి, బలాన్ని ఇస్తాయి. పిల్లల్లో ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారిస్తుంది. వేసవిలో రాగిజావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

– హరిత, ప్రభుత్వ వైద్యాధికారిణి, పగిడిరాయి పీహెచ్‌సీ